
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

మంగళవారం 5 ఆగస్టు 2025

పల్లెకు 24 గంటల విద్యుత్



బనవాసి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

- 33/11 కేవీ విద్యుత్ 113 సబ్ స్టేషన్లలో కొత్త ఫీడర్లు
- జిల్లాలో 519 గ్రామాలకు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ లక్ష్యం
- ఆర్‌డీఎస్‌ఎస్ కింద రూ.386 కోట్లతో గ్రామాల్లో కాంతులు
- వైసీపీ హయాంలో ఆగిన పనులు.. ఈ ప్రభుత్వంలో మళ్లీ మొదలు
- బనవాసి వద్ద రూ.120 కోట్లతో 220/132 కేవీ విద్యుత్ స్టేషన్

వైసీపీ హయాంలో విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేశారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా ఎండమావిగా మారింది. రాత్రి పూట విద్యుత్ మోటార్లు ఆన్ చేసేందుకు పొలాల్లోకి వెళ్లి ప్రమాదాలకు గురైన వారెందరో. అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక ఉత్పత్తులు పడిపోయాయి. పల్లెసీమలు అంధకారంగా మారాయి. గ్రామాలకు సైతం 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనే సంకల్పంతో కొత్త ఫీడర్లు ఏర్పాటుకు చేసే ఖర్చులో కేంద్రం 70 శాతం గ్రాంట్‌గా ఇచ్చింది. ఆ నిధులు కూడా సక్రమంగా వినియోగించుకోలేని దైన్య పరిస్థితి ఉండేది. జిల్లాలో 519 గ్రామాలకు నిరంతరాయంగా కరెంటు ఇవ్వాలని పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్‌ఎస్) కింద రూ.386 కోట్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ పనులు చేయకుండానే ఆపేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పనులు మొదలయ్యాయి. గ్రామసీమలకు నిరంతరాయంగా 24 గంటలు త్రీఫేజ్ కరెంటు సరఫరా కానుంది.

కర్నూలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ సరఫరా కోసం 220/132 కేవీ స్టేషన్లు నాలుగు ఉన్నాయి. వాటికి అనుబంధంగా 33/11 కేవీ సబ్ స్టేషన్లు 128 ఉన్నాయి. అందులో నగరం పరిధిలో 15 ఉంటే, గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ పంపిణీ చేసే సబ్ స్టేషన్లు 113 ఉన్నాయి. వివిధ అవసరాల కోసం కరెంటు పంపిణీ చేసేందుకు 570 ఫీడర్లు ఉన్నాయి. వివిధ అవసరాల విద్యుత్ కనెక్షన్లు 8,56,017 ఉన్నాయి. రోజుకు 10 మిలియన్ యూనిట్లు (ఎంయూ) విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే.. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వ్యవసాయానికి, గ్రామాల్లో గృహ, వాణిజ్య అవసరాలకు కరెంట్ సరఫరా చేసేందుకు ఒకే లైన్ (ఫీడర్) ఉండడంతో వ్యవసాయ విద్యుత్ పంపిణీ సమయంలో 9 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇచ్చి, ఆ తరువాత 15 గంటలు సింగిల్ ఫేస్ కరెంట్ సరఫరా చేస్తున్నారు. దీంతో పల్లెల్లో పిండిమర (ఫ్లోర్‌మిల్).. వంటి కుటీర పరిశ్రమలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాదు.. విద్యుత్ పంపిణీలో నాణ్యత లోపించి లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీటన్నిటికీ చెక్ పెట్టి గ్రామ సీమలకు సైతం 24 గంటలు నిరంతరాయంగా నాణ్యమైన త్రీఫేజ్ కరెంటు సరఫరాకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫీడర్లు ఆధునికీకరణ కోసం పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్‌ఎస్) కింద జిల్లాకు రూ.386 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం 70 శాతం గ్రాంట్ కింద ఇస్తే, 30 శాతం రుణం కింద ఇస్తారు. 2023లో నిధులు మంజూరు చేస్తే, అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ బిల్లులు రావనో, మరే ఇతర కారణంగానో పనులు చేయకుండానే ఆపేశారు.



పక్కన పడేసిన సబ్‌స్టేషన్ ఇనుప సామగ్రి

ఈ ప్రభుత్వంలో మొదలైన పనులు

గ్రామాలకు 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ పంపిణీ పనులపై వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం చూపించారు. జిల్లాలో 113 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో 570 ఫీడర్లు (విద్యుత్ పంపిణీ లైన్లు) ఉన్నాయి. త్రీఫేజ్ పవర్ సరఫరా కోసం 204 కొత్త ఫీడర్లు ఏర్పాటు, సబ్ స్టేషన్లు పునరుద్ధరణ కోసం ఆర్‌డీఎస్‌ఎస్ కింద రూ.386 కోట్లు మంజూరు చేశారు. 2023 సెప్టెంబరు 29న పనులు దక్కించుకున్న కడప జిల్లాకు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అయితే.. అప్పటి వైసీపీ హయాంలో పనులు మొదలు పెట్టలేదు. దీంతో 24 గంటలు నిరయంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ కలగానే మిగిలింది. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులపై దృష్టి సారించారు. గ్రామాల్లో కూడా పారిశ్రామిక ప్రగతి సాధించి యువతకు స్వయం ఉపాధి కల్పించాలంటే త్రీ ఫేజ్ విద్యుత్ పంపిణీ ఎంతో ముఖ్యమని కూటమి ప్రభుత్వం గుర్తించింది. కేంద్రం 70 శాతం గ్రాంట్ రూపంలో ఇస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవలనే లక్ష్యంతో ఎట్టకేలకు విద్యుత్ పంపిణీ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు.

జిల్లా అంతటా 24 గంటలు కరెంటు సరఫరా



జిల్లాలో పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్‌ఎస్) నిధులు రూ.386 కోట్లతో 519 గ్రామాలకు 24 గంటలు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ పంపిణీ పనులు వేగంగా జరుగుతున్నాయి. 33/11 కేవీ 113 సబ్ స్టేషన్ల పరిధిలో 204 ఫీడర్ లైన్లు పునరుద్ధరించాల్సి ఉంటే ఇప్పటికే 30 ఫీడర్లు పూర్తి చేసి 77 గ్రామాలకు 24 గంటలు కరెంటు ఇస్తున్నాం. గడువులోగా పనులు పూర్తి జిల్లా అంతటా 24 గంటలు కరెంటు పంపిణీ చేస్తాం. బనవాసి వద్ద రూ.120 కోట్లతో నిర్మించనున్న 220/132 కేవీ విద్యుత్ స్టేషన్ పనులు త్వరలోనే మొదలు పెడుతాం. ఈ స్టేషన్ పూర్తయితే ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో లోవోల్టేజీ సమస్యలే ఉండవు. వ్యవసాయం సహా వివిధ అవసరాలకు నాణకమైన విద్యుత్ అందుతుంది.

● ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ, కర్నూలు

ప్రస్తుతం 77 గ్రామాల్లో నిరంతర విద్యుత్

పల్లెసీమలకు సైతం నాణ్యమైన త్రీఫేజ్ కరెంటు ఇవ్వాలనే ధ్యేయంగా ప్రభుత్వం ఫీడర్ల పునరుద్ధరణ పనులపై నిత్యం సమీక్షలు చేస్తూ కాంట్రాక్ట్ సంస్థలపై ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాల్లో పనులు దక్కించుకున్న షిర్డీసాయి ఎలక్ట్రికల్ సంస్థ సబ్ స్టేషన్లు పునరుద్ధరణ, ఫీడర్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచింది. బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా నైపుణ్యం కలిగిన కూలీలతో పనులు చేస్తున్నారు. ఇప్పటికే 30 ఫీడర్లు పూర్తి చేశారు. ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో 45, ఆదోని డివిజన్‌లో 28, కర్నూలు డివిజన్‌లో 4 గ్రామాలు కలిపి 77 గ్రామాలకు 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ పంపిణీ చేస్తున్నారు. 174 ఫీడర్లు పూర్తి చేసి 442 గ్రామాలకు త్రీఫేజ్ పవర్ పంపిణీకి లైన్లు సిద్ధం చేయాల్సి ఉంది.

బనవాసి వద్ద 22/132 కేవీ విద్యుత్ స్టేషన్

ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లోని ఎమ్మిగనూరు, మాధవరం, గూడూరు 132/33 కేవీ విద్యుత్ స్టేషన్లకు కర్నూలు నగరంలో ఉన్న 220/132 కేవీ విద్యుత్ స్టేషన్ నుంచి కరెంటు పంపిణీ చేస్తున్నారు. ఎమ్మిగనూరు, మాధవరం విద్యుత్ స్టేషన్ల పరిధిలో వ్యవసాయ వినియోగ విద్యుత్ కనెక్షన్లు పెరగడంతో నాణ్యమైన కరెంట్ అందక రైతులు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య నివారణకు ఎమ్మిగనూరు మండలం బనవాసి 220/132 కేవీ విద్యుత్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.120 కోట్లు మంజూరు చేసింది. బనవాసి జెర్సీ పశుక్షేత్రానికి చెందిన 15 ఎకరాలు కేటాయించారు. హైదరాబాద్‌కు చెందిన సీఎంఆర్‌ఎం ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పనులు దక్కించుకుంది. రూ.66 కోట్లతో 220/132 విద్యుత్ స్టేషన్, విద్యుత్ లైన్ నిర్మాణాలు కాంట్రాక్ట్ సంస్థ చేస్తే, రూ.66 కోట్లతో అవసరమైన విద్యుత్ పరికరాలను ట్రాన్స్‌కో సంస్థ సరఫరా చేయనుంది. ఈ స్టేషన్‌కు పత్తికొండ మండలం జూటూరు నుంచి 220 కేవీ విద్యుత్ పంపిణీ లైన్ నిర్మిస్తారు. ఈ పనులు పూర్తయితే ఎమ్మిగనూరు, మాధవరం 132/33 కేవీ విద్యుత్ స్టేషన్ల పరిధిలో నాణ్యమైన విద్యుత్ అందుతుంది. అలాగే.. కర్నూలు 220/132 కేవీ విద్యుత్ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గనుంది.



సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

నేటి నుంచి వర్షాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మంగళవారం నుంచి 7వ తేదీ వరకు ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశముందని విశాఖపట్నం తుఫాను హెచ్చరిక కేంద్రం ప్రకటించింది. మంగళవారం కర్నూలు జిల్లాలో 115 ఎంఎం నుంచి 204 ఎంఎం వరకు భారీ వర్షం పడే అవకాశముందని, నంద్యాల జిల్లాలో 64ఎంఎం నుంచి 115 ఎంఎం వరకు మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని ప్రకటించారు. 6, 7వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలో సాధారణం నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

11 నుంచి డీఎడ్ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి డీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు పాత కంట్రోల్ రూం సమీపంలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని డీఈవో సూచించారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

● వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా నిల్వలు రైతులకు అవసరమైనంత మొత్తంలో ఉన్నాయని, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి హెచ్చరించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు సప్లయ్ అవుతున్న యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మిగిలిన 50 శాతం ఎరువులను ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే అవసరమైనంత యూరియాను మాత్రమే రైతులు పొలాల్లో వాడాలని సూచించారు. బస్తా యూరియా ధర రూ.266లు అని, ఈ మొత్తానికి మించి ఎక్కడైనా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతు సేవాకేంద్రాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల్లో ఎక్కడైనా ఎరువులను పక్కదారి పట్టిస్తే మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు విచారణ జరిపి సంబంధిత కేంద్రాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

● అడిషినల్ ఎస్పీ హుస్సేన్ పీరా

● పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 104 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా

కర్నూలు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకి వచ్చిన ఫిర్యాదులన్నింటిని విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా పేర్కొన్నారు. సోమవారం కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని:

- జిల్లా కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన హరిప్రసాద్, మురళీధర్‌రెడ్డి రూ.4లక్షలు తీసుకుని మోసం చేశారని, డబ్బులివ్వకుండా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా, ఎన్పీకుంట గ్రామానికి చెందిన ఎస్.అమీర్‌బాషా ఫిర్యాదు చేశారు.
- శ్రీనివాసాచారి అనే వ్యక్తి ఫైనాన్స్ కార్లను డబ్బుల కోసం తాకట్టు పెట్టి మోసాలకు గురి చేస్తున్నాడు. తర్వాత ఫైనాన్స్ వారు వచ్చి కార్లను తీసుకెళుతున్నారు. ఈ విధంగా నమ్మించి తనతో పాటు వెంకటేశ్వరరెడ్డి, వీరేష్, అనసుద్దీన్‌ల నుంచి కలిపి మొత్తం రూ.10లక్షలు తీసుకుని మోసం చేశాడని చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండలం, బిస్నిగేరి గ్రామానికి చెందిన ఈరన్న ఫిర్యాదు చేశారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించండి

● సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

● కలెక్టర్ రంజిత్ బాషా



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం'కు సంబంధించి ఎంపీడీవోల పరిధిలో, జడ్పీ సీఈవో, తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను డీఆర్వో పర్యవేక్షించి, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధం అన్నారు. కలెక్టరేట్ కార్యాలయాల పరిసరాల్లో ఎటువంటి చెత్తాచెదారం పడవేయకుండా సిబ్బందికి ఆదేశాలు జారీచేయాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లు స్వశక్తితో రాణించాలని కలెక్టర్ అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, సీపీవో హిమప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

కౌతాళం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాల్లో భాగంగా రెండో సోమవారం స్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయ క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. భక్తులు ఆదివారం రాత్రి నుంచే దర్శించుకునేందుకు బారులు దీరారు. రాత్రి విరామం లేకుండా దర్శన ఏర్పాట్లు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి మూల విరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఎల్ఎల్‌సీ కాలువలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. వాహనాల రద్దీతో అన్ని రూట్లలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది.



పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



వెండి అలంకరణలో స్వామివారి మూలవిరాట్

మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి

● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం సాయంత్రం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు ఏప్రిల్ 15వ ప్రారంభించిన కుట్టుమిషన్ల శిక్షణ మరి కొద్దిరోజుల్లో వంద రోజులు పూర్తిచేసుకోనున్న సందర్భంగా మహిళలు మంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ మహిళల కోసం ఈనెల 15న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బేసిక్ టైలరింగ్ శిక్షణ పథకానికి బీసీ, ఈబీసీ మహిళలను ఎంచుకుందన్నారు. జిల్లాలో 3,440 మంది మహిళలకి ఇస్తున్న శిక్షణకు 75 శాతం హాజరైన మహిళలకు టైలరింగ్ మోడల్ కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కోర్సులో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సతీష్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ ప్రభావతి, ఇన్‌స్పెక్టర్ రజనీ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి, కార్పొరేటర్ కురువ పరమేష్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

చట్టసభల్లో మహిళలకు పెద్దపీట
రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ 6

క్లాసులు ఫుల్ 7

శ్రీశైలం నుంచి అన్యమతస్థులను తరలించాలి

- గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- మహానంది క్షేత్రంలో ప్రత్యేక పూజలు
- ఘన స్వాగతం పలికిన ఆలయ అధికారులు



పూజలు నిర్వహించి వస్తున్న గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్

మహానంది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో వ్యాపారాలు చేస్తున్న అన్యమతస్థులను దేవదాయశాఖ అధికారులు గుర్తించి ఇతర ప్రాంతాలకు తరలించాలని గోషామహాల్(తెలంగాణ) ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సోమవారం సాయంత్రం మహానంది క్షేత్రంలో ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఏఈవో ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలంలో హిందూయేతరులను గుర్తించి క్షేత్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. దీన్ని సీఎం చంద్రబాబునాయిడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు. మహానందిలో కుల రాజకీయాలు చేయకుండా భక్తుల వసతి కల్పనకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, పసుపుల సుబ్బారెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి: ఫుడ్ సేఫ్టీ అధికారి



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల అమ్మకాల్లో, తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్ సూచించారు. సోమవారం నగరంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, టిఫిన్ పార్శిల్స్ పాయింట్లను ఆయన తనిఖీ చేశారు. ఆయా పదార్థాల తయారీకి వ్యాపారులు ఉపయోగిస్తున్న ముడిసరుకు, నూనెలను పరిశీలించారు. ఆహార విక్రయ ప్రదేశాల్లో పరిశుభ్రతను, మిగులు, వ్యర్థ పదార్థాలను తొలగింపు చర్యలను ఆయా విక్రయశాలల్లోని సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అహార పదార్థాల అమ్మకాల్లో వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే అమ్మకాలు చేయాలని, అందుకు విరుద్ధంగా అమ్మకాలు చేసే వారిపై చర్యలతో పాటూ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



కేజీబీవీల్లో విజయపథం

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో వినూత్న విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థినులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు ఎనిమిది నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థినులకు వారానికి ఐదు రోజులు స్లిప్ టెస్టులు నిర్వహించే షెడ్యూల్‌ను ప్రవేశ పెట్టారు. గత నెల (జూలై) 15న ఈవిధానాన్ని ప్రారంభించారు. తరగతి గదుల్లో కాకుండా ఆరుబయట చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీఅవర్, స్లిప్‌టెస్టులను నిర్వహించడంతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ అధికారులు పేర్కొంటున్నారు.

చాగలమర్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) కొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టారు. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు వారానికి ఐదు రోజులు స్లిప్ టెస్టులు పెట్టనున్నారు. చదువుపై దృష్టి సారించే చర్యల్లో భాగంగా స్టడీఅవర్స్, స్లిప్‌టెస్టుల నిర్వహణ చేపట్టాలని కేజీబీవీ డైరెక్టర్ ఇటీవల షెడ్యూల్ జారీ చేశారు. ఇందులో భాగంగా రాత్రి 10 గంటల వరకు స్టడీఅవర్ అమలు చేయాలని పేర్కొన్నారు. దీనికి 'విజయపథం' అని పేరు పెట్టారు. ఆ మరునటి రోజు ఉదయం ఐదు గంటలకు తిరిగి స్టడీఅవర్‌ను ప్రారంభించి ఆరు గంటలకు స్లిప్‌టెస్టు నిర్వహించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈమేరకు దీనిని గత నెల (జూలై) 15వ తేదీ నుంచి ప్రారంభించారు.



కేజీబీవీలో ఉదయం 6 గంటలకు స్లిప్ టెస్టులు రాస్తున్న విద్యార్థినులు

5,740 మందికి పైగా విద్యార్థినులు

జిల్లాలోని కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సెక్షన్‌కు 40 మంది చొప్పున బాలికలకు ప్రవేశం కల్పిస్తారు. ఈఏడాది ప్రవేశాల ప్రక్రియ పూర్త కావడంతో నంద్యాల జిల్లాలోని 27 కేజీబీవీల్లో ఇంటర్ వరకు 5,740 మందికి పైగా బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. చాగలమర్రి కేజీబీవీ, కళాశాలలో 269 మంది బాలికలు ఉన్నారు. 6, 7 తరగతులకు రోజు విడిచి రోజు స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు మంగళవారం నుంచి శనివారం వరకు రోజు టెస్టులు నిర్వహించాలని పేర్కొన్నారు.

- ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు స్లిప్ టెస్టులు
- వారానికి ఐదు రోజులు పరీక్షల నిర్వహణ
- ప్రతి రోజు స్టడీ అవర్స్
- నూతన విద్యా బోధనకు శ్రీకారం

విద్యాలయ ఆవరణలోనే ఆరు బయట..

ప్రతి రోజు తెల్లవారుజామున స్టడీ అవర్, స్లిప్ టెస్టులను విద్యాలయం ఆవరణలోనే విద్యార్థినులంతా కింద కూర్చొని పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. తరగతి గదుల్లో కాకుండా ఆరుబయట చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీఅవర్, స్లిప్‌టెస్టులను నిర్వహించడంతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆరుబయట నిర్వహించిన స్లిప్‌టెస్టులకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా వాటికి మంచి స్పందన లభించింది. ఎస్‌వో స్వప్న మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా ఏపీసీ ఆదేశాల మేరకు వినూత్న బోధన నిర్వహిస్తున్నామన్నారు. స్టడీ అవర్, స్లిప్‌టెస్టులను నిర్వహించడంతో మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రణాళికను కేజీబీవీ, కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు.

వీబీఆర్‌కు జలకళ

- ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- నీటినిల్వలు 16.32 టీఎంసీలు
- జలాశయం వద్ద సందర్శకుల తాకిడి

ఆత్మకూరు/వెలుగోడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టికట్ట కలిగిన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. తెలుగుగంగ పథకంలో భాగమైన జలాశయానికి కొన్నిరోజులుగా నిరంతరంగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి నీటివిడుదల కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే ఎగువ రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరడంతో జూలై 6 నుంచి వీబీఆర్‌కు నీటివిడుదలను ప్రారంభించారు. అప్పటినుంచి నేటి వరకు నిరంతరం వీబీఆర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌లోకి గరిష్ఠస్థాయికి చేరువలో నీటినిల్వలు నమోదు కావడం విశేషంగా చెప్పవచ్చు. శ్రీశైల జలాశయం బ్యాక్‌వాటర్ తెలుగుగంగ కాల్వ ద్వారా వీబీఆర్‌కు చేర్చడంతో జలాశయం గరిష్ఠ నీటిసామర్థ్యం 16.95టీఎంసీల గానూ సోమవారం సాయంత్రానికి 16.32టీఎంసీల నీటినిల్వలు నమోదయ్యాయి. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 14,600వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా వీబీఆర్ నుంచి మద్రాస్ ప్రధాన కాల్వకు 5,200 క్యూసెక్కులు, గాలేరు నదికి 9వేలు క్యూసెక్కులు, ఎస్ఆర్ కాల్వకు 60 క్యూసెక్కులు, ఎస్ఎల్ కాల్వకు 40 క్యూసెక్కులు, సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, నంద్యాల, ఆత్మకూరు, వెలుగోడు తాగునీటి పథకాలకు 20 క్యూసెక్కుల చొప్పున మొత్తం 14,590 క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. జలకళతో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయాన్ని వీక్షించేందుకు సందర్శకులు అధికంగా తరలివస్తున్నారు. వాహనాలను నేరుగా మట్టికట్టపైకి తీసుకెళ్లి అక్కడ ఆహ్లాదాన్ని పొందుతున్నారు.



జలకళతో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయం



వీబీఆర్ వద్ద సందర్శకుల తాకిడి



స్పిల్‌వే ద్వారా గాలేరు నదికి జరుగుతున్న నీటివిడుదల

ప్రణాళికాబద్ధంగా నీటి నిల్వలు..

వెలుగోడు జలాశయానికి నెల రోజులుగా వరద కొనసాగుతోంది. జలాశయంలోకి చేరే ఇన్‌ఫ్లో బట్టి ప్రాజెక్ట్‌లో నీటినిల్వలు నమోదు చేస్తున్నాం. వరద ప్రవాహంతో పాటు వర్షాల నీరు జలాశయంలో వచ్చి చేరితే గరిష్ఠ స్థాయి కంటే అధికంగా నీటినిల్వలు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలతో నీటినిల్వలు నమోదు చేస్తున్నాము. ఇన్‌ఫ్లోకు తగ్గట్టుగా ఔట్‌ఫ్లో నీటిని విడుదల చేస్తున్నాం.

- శివనాయక్, ఏఈఈ, తెలుగుగంగ పథకం, నంద్యాల

'అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్ర' పుస్తకావిష్కరణ

- రచయిత అజీజ్‌కు అభినందనలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి దివంగత అల్లూరి సత్యనారాయణ రాజుపై రాసిన 'అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్ర' ఆంగ్ల అనువాద పుస్తకాన్ని సోమవారం రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆవిష్కరించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ మంత్రులు వసంత నాగేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, అల్లూరి సత్యనారాయణ రాజు కుమారుడు జతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ రాజకీయ నాయకుడు అల్లూరి సత్యనారాయణ రాజు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను పుస్తకరూపంలో తీసుకువచ్చిన రచయిత అజీజ్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు

సహకారంతోనే అభివృద్ధి

- వ్యవసాయ, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- కర్నూలు డీసీసీబీకి అభినందన
- ఉత్తమ సహకార సంఘాలకు అవార్డుల ప్రదానం

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతోనే ఏ వ్యవస్థ అయినా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) 62వ వ్యవస్థాపక దినోత్సవం విజయవాడలోని మాటినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు సీఈవో రామాంజనేయులుతో పాటు రైతులకు ఉత్తమ సేవలు అందించినందుకు సహకార సంఘాల చైర్మన్లకు అవార్డులు మంత్రి అందించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు మంత్రి చేతుల మీదుగా సంఘాల అధ్యక్షులు అవార్డును అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లాలోని కడిమిట్ల, కొండాపురం, పాములపాడు సంఘాలు, అదేవిధంగా 2024-25 ఏడాదికి గానూ పోలూరు, మద్దికెర, సి.బెళగల్ సంఘాలను ఎంపిక చేశారు. ఆయా సంఘాలు ఈప్రోత్సాహకాన్ని ఒక ఉత్తేజిత ప్రక్రియగా తీసుకుని రైతు సోదరులకు సేవలందించి వారి మన్ననలు పొందాలని, మిగిలిన సంఘాలు కూడా ఇదే స్ఫూర్తితో వారి పనితీరు మెరుగుపరుచుకుని జిల్లాకు మంచి పేరు తీసుకోవాలని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు.



అవార్డులు అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో రామాంజనేయులు

చట్టసభల్లో మహిళలకు పెద్దపీట

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి పెద్దపీట వేసిన ఘనత భారతీయ జనతా పార్టీదేనని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఇండియన్ విజిటర్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఏపీ నుంచి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూషారెడ్డిని భారత ప్రతినిధిగా ఎంపిక చేసిన సందర్భంగా సోమవారం స్థానిక మౌర్యఇన్ హోటల్‌లోని పరిణయ హాలులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ అమెరికా డిపార్టుమెంట్ ఆఫ్ స్టేట్ నిర్వహిస్తున్న ఐవీఎల్‌పీ కార్యక్రమం భావి ప్రపంచ నాయకుల మధ్య పరస్పర అవగాహనను భావాజాలు మార్పి డికి ప్రధాన దీపికగా నిలుస్తుందన్నారు. అమెరికా ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎప్పుడు ఏం మాట్లాడుతారో అర్థం కాద న్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవాలయాలను విధ్వంసం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. దేవాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాల న్నారు. బీజేపీ రాయలసీమ డిక్లరేషన్‌ను మళ్లీ తెరమీదకు తెస్తామన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మహిళల సాధికారతకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. డాక్టర్ వినూషారెడ్డి మాట్లాడుతూ ఐవీఎల్‌పీకి ఇండియా నుంచి తనను బీజేపీ ఎంపిక చేయడం పట్ల కేంద్ర, రాష్ట్ర జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, పురుషోత్తంరెడ్డి, బీజేపీ మహిళా ప్రతినిధులు గీతామాధురి, మాలతి పాల్గొన్నారు.

అక్రమార్కులు తప్పించుకోలేరు

- ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమారులెవరూ తప్పించుకోలేరని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఘాటుగా విమర్శించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణంలో 2008లో మంజూరై 2009లో అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో రూ. 44కోట్లతో ప్రారంభమై నేటికి అసంపూర్తిగా ఉన్న యూజీడీ(అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ)లో జరిగిన అక్రమాలపై విచారణ కమిటీ వేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిపై విచారణకు వైసీపీ నాయకులే పరోక్షంగా కోరుతున్నారన్నారు. వైసీపీకి చెందిన నాయకులు పట్టణంలో యుజీడీ పూర్తి చేశామని, ఇందులో అవినీతి అక్రమాలు జరిగాయని, ప్రజాప్రతినిధి మేల్కోవాలని, విచారణచేయాలని ఓ వీడియోలో చెప్పారన్నారు. వారు కోరిన విధంగా త్వరలో విచారణ చేయిస్తామన్నారు. 2014లో తాను ఎమ్మెల్యేగా వచ్చిననాటికి 75శాతం పూర్తి అయిందని రూ. 44 కోట్లలో రూ. 36.60 కోట్లు ఖర్చు చేసినట్లు నిధులు మంజూరు చేశారన్నారు. నిధులు ఖర్చు అయినా పనులు మాత్రం పూర్తికాలేదన్నారు. పనులు ఎందుకు అసంపూర్తిగా ఉన్నాయోనని పరిశీలించి కాంట్రాక్టర్‌తో మట్లాడి 2019నాటికి 95శాతం పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆ తరువాత ఎమ్మెల్యేగా వచ్చిన చెన్నకేవరెడ్డి ఎమ్మిగనూరు పర్యటనకు వచ్చిన అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి యూజీడీ పూర్తి చేసేందుకు రూ. 26కోట్లు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చారన్నారు. మరి పథకం పూర్తి అయివుంటే ఎందుకు నిధులు ఇవ్వాలని కోరారో వైసీపీ నాయకులు చెప్పాలన్నారు. వాస్తవంగా రూ.16 కోట్లు అవసరమని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. తన తండ్రి బీవీ మోహన్ రెడ్డి కల కర్నూలు, మంత్రాలయం రైల్వేలైన్‌కు కేంద్రం చేత డీపీఆర్ ఆమోదింపజేశానన్నారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణానికి రూ. 200కోట్లతో బైపాస్ రోడ్డు కూడా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరానన్నారు. ఇది త్వరలో వస్తుందని, ఆదోని, కోడుమూడు రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరానన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అవి త్వరలో మంజూరు కానున్నాయన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, నాయకులు మాజీ సర్పంచ్ కాశీం వలి, తిమ్మారెడ్డి, రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, ముల్లా కలీముల్లా, రంగస్వామి గౌడ్, కౌన్సిలర్ రామదాసు గౌడ్ పాల్గొన్నారు.

8 నుంచి రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు

మంత్రాలయం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు ఈ నెల 8 నుంచి 14వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం పీఠాధదిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం స్థానిక గురునివాస్‌లో ఉత్సవాలపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమై 14వ తేదీ సర్వ సమర్పణ సేవతో ఉత్సవాలు ముగింపు పలుకుతున్నట్లు తెలిపారు. ఆరాధనలో ముఖ్యమైన 10న పూర్వా రాధన, 11న మధ్యారాధన, 12న ఉత్తరారాధన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని, ఈ మూడు రోజుల పాటు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నట్లు తెలిపారు. పూర్వారాధనలో టీటీడీ నుంచి, తమిళనాడు శ్రీరంగం, కంచి మఠం నుంచి రాఘవేంద్రస్వామికి పట్టువస్త్రాల సమర్పిస్తారని తెలిపారు. 11న మధ్యారాధనలో మధ్యాహ్నం బంగారు రథంపై రాఘవేంద్రస్వామి ఊరేగింపు, బృందావనం నాలుగు వైపుల అలంకరణ ప్రత్యేకంగా ఉంటుందన్నారు. 12న మహారథోత్సవంలో భాగంగా రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని నవరత్నాల కవచంతో అలంకరిస్తామన్నారు. 2025 ఏడాదిలో రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులకు తమిళనాడు చెందిన రామేశ్వరంలోని సామాజికవేత్త విఠల్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి చెందిన ప్రముఖ జయరామ్ శుక్లాకు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2025 అవార్డుకు ఎంపిక చేశామని, ఈ నెల 10న యోగేంద్ర కళామండపంలో పురస్కారం అందజేస్తామన్నారు. బెంగుళూరుకు చెందిన ప్రకాష్ శెట్టి అనే భక్తుడు దాదాపు రూ.9 కోట్లతో సొంతంగా నిర్మించిన పుష్కరిణి శాస్త్రోక్తంగా ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో భర్త అరెస్టు


నిందితుడిని చూపుతున్న పోలీసులు

కోసిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన దుద్ది లక్ష్మి (48) హత్య కేసులో ఆమె భర్తను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. నరసింహులు మద్యానికి బానిసై నిత్యం భార్యను వేధించేవాడు. అందులో భాగంగానే గత నెల 30న సాయంత్రం 5.30 గంటల సమయంలో భార్యతో గొడవపడి ఇంట్లో ఉన్న రోకలితో తలపై బాది పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మి మృతి చెందింది. లక్ష్మి కుమారుడు హుశేనీ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఊరి చివర ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిందితున్ని అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన రోకలిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు

సెల్‌ఫోన్ దొంగలు దొరికారు

- ముఠా అరెస్టు.. 59 సెల్‌ఫోన్లు స్వాధీనం

కోడుమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, బస్‌స్టాండ్ వంటి రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను దొంగలించే ముఠాను సోమవారం కోడుమూరు పోలీసులు పట్టుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఐ తబ్రేజ్ వివరాలు వెల్లడించారు. డోన్ మండలం చిగురుమాన్‌పేట గ్రామానికి చెందిన ఎరుకలి శశికుమార్, శ్రీనుతో పాటు మరో ఇద్దరు మైనర్ బాలురు కలిసి కొంత కాలంగా ఏపీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలల్లో సెల్‌ఫోన్లు దొంగలించారు. మూడు రోజు కిందట కోడుమూరులో మూడు సెల్‌ఫోన్లు దొంగలించారు. ఆ సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వాళ్లకు అమ్మి, వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. సెల్‌ఫోన్లు దొంగలించేందుకు కోడుమూరుకు వచ్చి కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ వద్ద తిరుగుతు న్నారు. అనుమానంవచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారించి ఆనలుగురు సెల్‌ఫోన్ దొంగలని నిర్ధారించాం. వాళ్ల నుంచి 59సెల్‌ఫోన్లను స్వాధీన పరుచుకున్నాం. నిందితులు దొంగలించిన సెల్‌ఫోన్లలో ఎక్కువ శాతం కర్ణాటక రాష్ట్రంకు చెందిన వాళ్లవిగా గుర్తించాం. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వాళ్లను ఇక్కడికి పిలిపించి సెల్‌ఫోన్లను అందిస్తామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పెసలదిన్నె గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. పెసలదిన్నెకి చెందిన నరసింహులు కుమారుడు కృష్ణమూర్తి (34) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండెకరాల సొంత పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి, వేరుశనగ, పత్తిని సాగుచేశాడు. పత్తి పంటకు రాత్రి నీరు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో ఉన్న బోరును ఆన్ చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కి ందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా రామకృష్ణ విగతజీవిగా పడిఉన్నాడు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సరోజ, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుందూనదిలో మృతదేహం లభ్యం

ఉయ్యాలవాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సమీపంలోని కుందూనది వద్ద మృతదేహం లభ్యం అయ్యింది. వివరాలలోకి వెళ్తే ఈ నెల 1న బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ముర్తుజా వలిహుశేన్(22) నదిలోకి దిగి తన ఆటో శుభ్రం చేస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి గల్లంతయ్యాడు. పోలీసులు, ఎండీఆర్ఎఫ్ బృందంతో కలిసి కుందూనదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం ఉయ్యాలవాడ మండలంలోని బోడెమ్మనూరు గ్రామ కుందూనది వంతెన వద్ద మృతదేహాన్ని గుర్తించారు. బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు.

నేడు జర్నలిస్టుల ధర్నా


కర్నూలు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నటు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సభ్యుడు కె. నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, యాక్సిడెంటల్ ఇన్సూరెన్సు పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, హెల్త్ కార్డు సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

క్లాసులు ఫుల్

నో అడ్మిషన్లు అంటూ బోర్డు

విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. మధ్యాహ్న భోజనంలో సమూలమైన మార్పులు చేసి, సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం వడ్డించడం, 'తల్లికి వందనం' కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అంతమందికి రూ.15వేలు జమ చేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. క్రీడలు, ఎన్‌సీసీకి ప్రాధాన్యత ఇస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు లేవంటూ నోటీసు బోర్డు పెట్టేశారు.

- నెహ్రూ మెమోరియల్ పాఠశాలకు విద్యార్థుల తాకిడి
- కిక్కిరిసిన తరగతి గదులు
- 'ఎక్స్' వేదికగా మంత్రి నారా లోకేశ్ అభినందన


Lokesh Nara @naralokesh
Translate post
ఆదోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో నో అడ్మిషన్ బోర్డు చూసి చాలా ఆనందించాను. 1725 మంది విద్యార్థులున్న ఈ హైస్కూలులో ఈ ఏడాది అన్ని తరగతుల్లో 400 మందికి పైగా కొత్త విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనం. "నో అడ్మిషన్ బోర్డు పెట్టి, అడ్మిషన్స్ క్లోజ్ చేశాం... తల్లిదండ్రులకు నచ్చచెప్పుతున్నా... మా పిల్లాడి ఒక్కడిని చేర్చుకోండి సార్" అని బతిమాలుతుంటే కాదనలేకపోతున్నామని



నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో సీట్లు లేవని నోటీసు బోర్డు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. బడి తెరిచిన నాటి నుంచి ప్రతి రోజు సిఫార్సు లేఖలతో చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్చుకోవాలని క్యూ కడుతున్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు అడ్మిషన్లు లేవంటూ నోటీసు బోర్డు పెట్టారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ ద్వారా హెడ్‌మాస్టర్ ఫయాజుద్దీన్‌ను, ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన హెచ్ఎం ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులను ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దే రథసారథులు అంటూ.. మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' ద్వారా అభినందనలు తెలిపారు.

ఆరు నుంచి పదో తరగతి వరకు..

ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠశాలల్లో 1725 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కోగదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. తరగతి గదులు చాలక ఉపాధ్యాయులు ఇక కూర్చోడానికి స్థలం లేదని, మిమ్మల్ని బడిలో చేర్చుకోలేమంటూ నోటీసు బోర్డు పెట్టేశారు. ఆ పాఠశాలకు ఏటా పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతుండటంతో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో బోధన చేస్తుండటం, ఎన్‌సీసీ, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుండటంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

అదనపు తరగతి గదులు నిర్మిస్తే...

కేవలం 20 గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థులకు ఏమాత్రం సరిపోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' కింద అదనపు తరగతి గదులు 12 నిర్మించినా, అవి మొండిగోడలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే, పాఠశాల మరింత అభివృద్ధితో పాటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని తల్లిదండ్రులు అంటున్నారు.

450 మందికి అడ్మిషన్

2025-26 విద్యా సంవత్సరానికి 450 మంది చేరారు. వీరిలో 450 మందికి అడ్మిషన్ నెంబర్ ఇవ్వగా.. 25 మందికి అడ్మిషన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంది. ఒక్కో తరగతి గదిలో 120 మందికి పైగా విద్యార్థులున్నారు. తరగతి గదిల్లో కూర్చోడానికి కూడా స్థలం లేక, కొంతమంది విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం.. ఉపాధ్యాయుల కృషి..



ప్రభుత్వ పాఠశాలలకు కల్పిస్తున్న ప్రోత్సాహంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగింది. దీంతో తమ పాఠశాలలో చేర్పేందుకు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. ఉపాధ్యాయులు వినూత్న బోధనతో ఆకట్టుకుంటున్నారు. తల్లిదండ్రులకు మన్నించాలని చెబుతూనే ఉన్నా పాఠశాలకు క్యూ కడుతున్నారు. **- ఫయాజుద్దీన్, హెచ్ఎం, నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఆదోని**

రేషన్‌కార్డు కోసం వేలిముద్ర వేస్తే..

- ఎనిమిది ఏళ్ల క్రితం తప్పిపోయిన బాలుడి ఆచూకీ గుర్తింపు
- రేషన్‌కార్డు గుర్తింపుతో తల్లిదండ్రుల చెంతకు


ఉయ్యూరులో బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగింత

ఆదోని, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు రేషన్ కార్డు కోసం వేలిముద్ర వేసేందుకు రావడంతో అతడి ఆచూకీ లభ్యమైంది. అతడు ఉయ్యూరు పట్టణంలోని శిరీష రిహాబిలిటేషన్ సంస్థలో ఆశ్రయం పొందుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి చొరవతో ఆ యువకుడిని తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాలు.. ఆదోనిలోని శివశంకర్‌నగర్‌కు చెందిన వడ్డే నాగరాజు, లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. అందులో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. నాలుగో కొడుకు శ్రీకాంత్ 2018లో తప్పిపోయాడు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు అతడి వయస్సు 12 ఏళ్లు. మతిస్థిమితం లేని అతడు ఎలాగో అలా ఆదోని రైల్వేస్టేషన్ నుంచి రైలులో విజయవాడకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్లో మతిస్థిమితం లేక తిరుగుతున్న అతడిని విజయవాడ రైల్వే పోలీసులు గుర్తించి అక్కడి చైల్డ్‌కేర్ అధికారులకు అప్పగించారు. వారు కలెక్టర్ ఆదేశాలతో ఉయ్యూరులోని శిరీష రిహాబిలిటేషన్ సంస్థకు అప్పగించారు. అతడు టీబీతో బాధపడుతున్నట్లు గుర్తించి గుంటూరులోని టీబీ ఆసుపత్రిలో చేర్చారు. మూడునెలల పాటు చికిత్స అందించి ఆరోగ్యంగా తయారయ్యాక శ్రీకాంత్‌ను అక్కడే సంస్థ ఆలనాపాలనా చూశారు. రేషన్‌కార్డు చేయించి పింఛన్‌కు దరఖాస్తు చేసుకుందామన్న ఉద్దేశంతో రేషన్‌కార్డు కోసం వేలిముద్ర వేయించారు. అప్పటికే రేషన్ కార్డు ఉందని ఎర్రర్ అని రావడంతో మరిన్ని వివరాలు సేకరించారు. రేషన్‌కార్డు సాయంతో తల్లిదండ్రుల వివరాలను రిహాబిలిటేషన్ సంస్థ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్ నుంచి ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసు లు ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తప్పిపోయిన తమ కుమారుడు ఉయ్యూరులోని రిహాబిలిటేషన్ సంస్థలో ఉన్నాడని తెలుసుకొని అక్కడికి వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆసంస్థ వారు తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఎనిమిదేళ్ల తర్వాత తమ బిడ్డను కలుసుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చేరదీసిన ఆ సంస్థకు, టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మిరప, టమోటా పంటల ధ్వంసం

- సుమారు 2లక్షలు నష్టపోయామంటున్న రైతులు


దుండగులు ధ్వంసం చేసిన పంట

పత్తికొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎకరా పొలంలో సాగుచేసిన మిరప, టమోటా పంట లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో సుమారు రూ.2లక్షలు నష్టపోయామని పందికోన గ్రామానికి చెందిన రైతులు మద్దినేని కదిరప్ప, మద్దినేని వెంకటేశ్వర్లు ఆరోపించారు. తమకున్న ఎకరా పొలంలో డ్రిప్‌పైపులు వేసుకుని మిరప, టమోటా పంటలు సాగుచేశామన్నారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కోతకు వచ్చిన మిరప, టమోటా పంటను తెంపడంతో పాటు డ్రిప్‌పైపులకు నిప్పుపెట్టారని వాపోయారు. పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశామన్నారు.

నిందితుడికి రిమాండ్

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లదొడ్డి సమీపంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు ఠాగూర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అతడిని డీఎస్పీ భార్గవి ముందు పరిచి ఆలూరు కోర్టుకు తరలించారు. ఆలూరు కోర్టు న్యాయాధికారి నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో బీసీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమం సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని బిర్లాకాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసు లు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ కృష్ణాజీరావు, ప్రచార కార్యదర్శి రాంబాబు, మనోహర్‌రెడ్డిలతో కలిసి ఈనెల 18, 19 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టబోయే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో 544 మంది లోక్‌సభ సభ్యుల్లో 280 మంది బీసీలు ఉండాలి, కానీ కేవలం 110 మంది మాత్రమే ఉన్నారన్నారు. బడ్జేట్ కేటాయింపుల్లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతుందని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, 50 వేల కోట్లతో బీసీలకు ప్రత్యేక సబ్ ప్లాన్, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పీజీ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఓ ఉద్యోగి అనుచరులపై ఫిర్యాదు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలన గాడి తప్పిందని, ఇటీవల బదిలీ అయిన ఓ సీనియర్ అసిస్టెంట్ కనుసైగల్లో తన అనుచరు లకు ఆర్థిక లావాదేవీల సీట్లలో కొనసాగుతున్నారని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు కే.మాధవస్వామి సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి ఒకే సీటులో విధులు నిర్వ హించిన సీనియర్ అసిస్టెంట్ బదిలీ అయినా తర్వాత అధికారులు ఎంతో కీలకమైన ఈ సీటును తన అనుచరులకే ఇచ్చారని, అలాగే ఓ బినామి ఉద్యోగికి ఆరోగ్యశ్రీ, సదరం, ఆర్థిక లావాదేవిల వ్యవహా రాలన్నీ అతని పేరు మీద జరుగుతున్నాయని, రెగ్యులర్ ఉద్యోగు లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. తక్షణమే కలెక్టర్ బదిలీ అయిన సీనియర్ అసిస్టెట్ అనుచరుల సీట్లను మార్చాలని, సీనియార్టీ ప్రాతిపాదికన సీట్లు ఇతరులకు కేటాయించాలని కోరారు.

అబార్షన్ కేసులో నిందితుల అరెస్టు

నందికొట్కూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అబార్షన్ కేసులో పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మ ణ్యం తెలిపారు. వివరాలు.. పగిడ్యాల మండలం బీరవోలుకి చెందిన శ్రీవాణికి లింగనిర్ధారణ పరీక్షలు చేయించిన భర్త లోకేష్, అత్త నాగేంద్రమ్మ, నందికొట్కూరులోని ఆర్ఎంపీ డా.గీతారాణి సహకారంతో గర్భస్థ లింగ నిర్ధారణ కోసం కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లోని స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేపించి గర్భంలో ఆడబిడ్డ ఉన్నట్లు నిర్ధారణ చేసుకున్నారు. జూలై 29న పట్టణంలోని వీర భద్ర క్లినిక్‌లో ఆర్ఎంపీ గీతారాణితో అబార్షన్ చేయించారు. మరుసటి రోజు 30వ తేదీ ఉదయం శ్రీవాణికి తీవ్ర రక్తస్రావమై చనిపోయింది. ఈ ఘటనపై శ్రీవాణి తల్లి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈమేరకు నిందితులు లోకేశ్, నాగేంద్రమ్మ, ఆర్ఎంపీ డాక్టరు గీతారాణి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. కర్నూలులోని రక్షా హాస్పిటల్‌లోని స్కానింగ్ టెక్నీషియన్ శేఖర్, అదే హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రక్ష హాస్పిటల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు

కర్నూలు హాస్పిటల్: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం బీరవోలుకు చెందిన గర్భిణికి ఓ ఆర్ఎంపీ అబార్షన్ చేయగా.. వికటించి గర్భిణి మృతి చెందిన విషయం విధితమే. గర్భిణికి స్కానింగ్ చేసింది కర్నూలులోని రక్ష హాస్పిటల్ అని, చర్యలు తీసుకోవాలని నంద్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ రెండు రోజుల క్రితం కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు లేఖ రాశారు. శనివారం కర్నూలు డీఎంహెచ్‌వో రక్ష హాస్పిటల్‌కు వెళ్లగా సిబ్బంది ఎవరూ లేకపోవడంతో స్టోర్ రూమ్‌కు తాళం వేసి వెనుదిరిగారు. విచారణ చేయ డానికి యాజమాన్యం ఎవరూ లేకపోవడం, సమాచారం ఇవ్వకపో వడంతో ఆదివారం డీఐవో డా.నాగప్ర సాద్, డెమో శ్రీనివాసులుశెట్టి సిబ్బందితో రక్ష హాస్పిటల్‌కు షోకాజ్ నోటీసులు అతికించారు. ఆ తర్వాత సిబ్బందికి నోటీసును అందజేశారు. రెండు రోజుల్లో నోటీస్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. గర్భిణి మరణించి ఆరు రోజులవు తున్నా కర్నూలు వైద్యాధికారులు విచారణను వేగవంతంగా జరిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రక్ష హాస్పిటల్‌లో చట్టవిరుద్ధంగా స్కానింగ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చినా ఎందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించడం లేదని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆ ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ మిషన్ లేనప్పుడు గర్భిణికి స్కానింగ్ ఎలా చేశారు..? ఎవరు చేశారు..? అన్నది కర్నూలు వైద్యఆరోగ్య శాఖ అధికారులు విచారణ వేగవంతం చేయాలని, ఇందులో నిజనిజాలు బహిరంగ పరచాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

దంచికొట్టిన వాన

● బీసీ కాలనీ జలమయం ● ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
● కాలనీవాసుల ఇబ్బందులు



లొద్దిపల్లె బీసీ కాలనీలో ప్రవహిస్తున్న వర్షపు నీరు.. ఇళ్లలోకి చేరిన నీరు

ఓర్వకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో సోమవారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. దీంతో గ్రామ నడిబొడ్డున నడివాగు వర్షం నీటితో పొంగిపొర్లడంతో బీసీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. వాగు సమీపాన ఉన్న పత్తి పొలాల్లో భారీఎత్తున వర్షం నీరు చేర డంతో రైతులు సాగు చేసిన పత్తి పంట నీటిలో మునిగిపోయింది. జాతీయ రహదారిపై నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 3గంటల సేపు వర్షం దంచి కొట్టడంతో బీసీ కాలనీ అంతా జలమయమైంది. ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు కాలనీల్లో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. దేవనగర్, విఠల్‌నగర్ మార్గంలో రైల్వే ట్రాక్, కేసీ కెనాల్ మధ్యలో రెండో రైల్వేలైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా.. సోమవారం మున్సిపల్ 400 ఎంఎల్ పైపులైన్ ధ్వంసమైందని తెలిపారు. దీంతో 21వ వార్డులో శ్యామలనగర్, మహాలక్ష్మి నగర్, డాక్టర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారధి నగర్, లేపాక్షి నగర్, 25వ వార్డులో ఓల్డ్ హౌసింగ్ కాలనీ, న్యూ హౌసింగ్ కాలనీ బోర్డు, ఎం డోమెంటు కాలనీ, బిర్లా కాంపౌండ్, అరోరానగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మరమ్మతు పనులు పూర్తి చేసి బుధవారం నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.

రైతులను లాభాల బాట పట్టించండి

● ఆయిల్ పామ్ సాగుతోనే అన్నదాతకు మేలు
● కలెక్టర్ రంజిత్ బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైతుల కష్టాలను క్షేత్ర స్థాయికి వెళ్లి గుర్తించి, వారిని లాభాల బాట పట్టించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ సాగును రైతులతో చేయించాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కర్నూలు జిల్లాకు 550 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం నిర్దేశించిందని, దీనిని సాధించేందుకు క్షేత్ర స్థాయిలో వెళ్లాలని ఆదేశిం చారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పామ్ పథకం కింద జిల్లాలో క్రిష్ణగిరి, కర్నూలు, సి.బెళగల్, కౌతాళం, ఆదోని, హోళగుంద, మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి నందవరం, ఎమ్మిగనూరు, హాలహర్వి, గోనెగండ్ల తదితర 13 మండలా లను ఆయిల్ పామ్ సాగుకు ఎంపిక చేశామన్నారు. ఈ మండలాల్లోని నీటి వసతి కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు వంద శాతం రాయితీతో మొక్కలు అందిస్తామన్నారు. అదేవిధంగా ప్రతి ఏడాది 5,250 అందించడంతోపాటు అంతర్ పంట ప్రోత్సాహకానికి ప్రతి సంవత్సరం రూ.5,250 నాలుగేళ్లపాటు అందిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు, ఏపీఎం ఐపీ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ సరఫరాపై జేసీ సమీక్ష



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 65 సంవత్సరాలు పైబడిన లబ్ధిదారులకు డోర్ డెలివరీ ద్వారా రేషన్ సరఫరాపై జాయింట్ కలెక్టర్ బి.నవ్య సోమవారం రేషన్ డీలర్లు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో 65 సంవత్సరాలు పైబడిన లబ్ధిదారులకు రేషన్‌ను జూన్ నెలలో 76 శాతం, జూలై నెలలో 82 శాతం, ఆగస్టు నెల నేటీ వరకు 68 శాతం పంపిణీ చేశామన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారు మూడు నెలల నుంచి రేషన్‌ను పొందని లబ్ధిదారులు ఈ నెల తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో రాజా రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన వేడుకలు



గౌరు చరితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే జయసూర్య, మల్లెల రాజశేఖర్, కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



ఓర్వకల్లులో కేక్ కట్ చేస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి



ఎమ్మెల్యే గౌరు చరితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి జన్మదిన వేడుకలు తన స్వగృహంలో ఘనంగా జరుపుకున్నారు. పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దం పతులు కేక్‌కట్ చేశారు. నాయకులు ఎమ్మెల్యే గౌరు చరితకు పూల మొక్కలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీహౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నాగరాజు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

● **గౌరు చరితకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి:** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఎమ్మెల్యే గౌరు చరిత నివాసానికి విచ్చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గౌరు దంపతులు మంత్రి టీజీని సాదరంగా ఆహ్వానం పలికారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. అలాగే నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గౌరు దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● గౌరు దంపతుల తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి బి.క్యాంప్‌లోని మన వృద్ధుల ఆశ్రమంలో సోమవారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే దొడ్డిపాడు టీడీపీ నాయకులు మన వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వెంకటప్ప, దొడ్డిపాడు బాషా, ధనుంజయ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅ తిథిగా టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి చేశారు. ఉపాధి కూ లీలకు క్యారియర్ బాక్సు, చరితమ్మ ఫోటో ఉన్న బ్యాగును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ నాయకులు మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్‌రావు, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, రామకోటేశ్వరరావు, ఏసేపు, నాగేశ్వరరెడ్డి, అల్లాబాబు, అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి నంద్యాల జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కర్నూలు నగరంలోని మాధవీనగర్‌లో ఎమ్మెల్యే కలిశారు. గౌరు చరితకు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.









యాప్‌లను రద్దు చేయాలి



సీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయు నగర కార్యదర్శి ఎస్.మహ్మద్ రఫీ డిమాండ్ చేశారు. కర్నూలు సీడీపీవో ఆఫీసు ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. మహ్మద్ రఫీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా, అద నపు యాప్‌లు పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహణకు ఇచ్చిన ఫోన్, పోషణ ట్రాక్టర్ బాల సంజీవని యాప్ అమలుకు సపోర్టు చేయడం లేదని, లబ్ధిదారులకు సరుకులు ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయలక్ష్మి, వరలక్ష్మి, విజయభారతి, పద్మ, సువర్ణ, పార్వతి, సరస్వతి పాల్గొన్నారు.

రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు



కర్నూలు కల్చరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ప్రతినిధి, సామాజిక సేవకుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సౌత్ అమెరికా దేశం నుంచి అంత ర్జాతీయ అవార్డు అందుకున్నారు. సౌత్ అమెరికా దేశానికి చెందిన వెనిజులా అంతర్జాతీయ సంస్థ వరల్డ్ లిటరరీ ఫోరం ఫర్ పీస్ అండ్ హ్యూమన్ రైట్స్ సోమవారం ఈ అవార్డును అంతర్జాలం ద్వారా శ్రీనివాస్‌కు అందజేసింది. కర్నూలు నగరానికి చెందిన డాక్టర్ రాయ పాటి శ్రీనివాస్ గత ముప్పయ్ సంవత్సరాలుగా విద్య, ఆరోగ్య, సామా జిక రంగాల్లో తనదైన సేవలు అందిస్తున్నారు. రాయపాటి శ్రీనివాస్ చేస్తున్న సేవలను గుర్తించి, లిటరరీ ఫోరం ఫర్ పీస్ అండ్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్‌కుమార్ బిశ్వ సోమవారం అంతర్జా లంలో జరిగిన సమావేశంలో ఈ పురస్కారాన్ని అంతర్జాలం ద్వారా ప్రకటించి అందజేశారు. రాయపాటి శ్రీనివాస్ మా ట్లాడుతూ ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులను అనుమతించొద్దని పాఠశాల విద్యాశాఖ కమి షనర్ అండ్ డైరెక్టర్ విజయరామరాజు జారీ చేసిన ఉత్తర్వులను కర్నూలు జిల్లా ప్రైవేటు యాజమాన్యాల సంఘం జిల్లా కమిటీ స్వాగతిస్తుందన్నారు. సోమవారం స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని కేవీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆపుస్మా జిల్లా కమిటీ అధ్యక్షులు బి.వాసుదేవయ్య, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర నాయకులు ఎస్.సాధు శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు చూపించారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ పాఠశాలల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు తల్లిదండ్రులను మాత్రమే అనుమతించాలని, అనధికార వ్యక్తుల ప్రవేశాలు, విద్యాకార్యక లాపాలకు అంతరాయం కలుగుతుందని అన్నారు. ఆపుస్మా నగర అధ్యక్షుడు యుగంధర్, సెక్రటరీ శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేష సాయి, ఆర్‌ఓ జునైద్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అమీర్‌హైదర్ నగర్, జొహరాపురం, బుధవారపేట ప్రాంతాలలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కె.రామక్రిష్ణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. నిర్మల మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలో గత 20 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్, మహబూబ్‌బాషా, పద్మావతి, అమీనా, వేణమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

● రెవెన్యూ అధికారులను ఆదేశించిన మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ రెవన్యూ అధికారులకు ఆదేశించారు. సోమవారం సాయంత్రం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అమీర్ హైదర్‌ఖాన్ నగర్, కారల్ మార్క్స్‌నగర్, బుధవారపేట, జగన్నాథగట్టుపై టిడ్కో ఇళ్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇళ్ల పట్టాలు లేనిచో వారికి పట్టాలు ఇచ్చే విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రభుత్వ క్వార్టర్స్‌పై ఆరాతీశారు. ఖాళీగా ఉన్న వాటిని ఇతరులు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్‌వో వెంకటనారాయణమ్మ, కర్నూలు రూరల్, అర్బన్, కల్లూరు తహసీల్దార్లు రమేష్‌బాబు, రవికు మార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్నాం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని 22వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

సీపీఎం నాయకుడు షడ్రక్ వర్ధంతి



మాట్లాడుతున్న గఫూర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో సీపీఎం నాయకుడు టి.షడ్రక్ 5వ వర్ధంతి పార్టీ నాయకులు నిర్వహించారు. సోమ వారం కార్మిక కర్షక భవన్, స్థానిక గడియారం ఆసుపత్రి ఎదురుగా సుర్జీత్ భవన్, షరీన్‌నగర్, వీకర్‌సెక్షన్‌కాలనీ, ముజఫర్‌నగర్ తదితర ప్రాంతాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మానికి సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఏ.గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గఫూర్ మాట్లాడుతూ షడ్రక్ జీవితకాలం కార్మిక, కర్షక, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్, సాయిబాబా, సుధాకరప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి : ఏఐఎస్ఎఫ్

కోడుమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ, బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రంగస్వామి మాట్లాడుతూ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. విద్యార్థులకు సరిపడ గదులు, మరుగుదొడ్లు లేవన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. వీరేంద్ర, అల్తాఫ్, మాబు, అశోక్ పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ సర్కిల్, కర్నూలు నగర పాలక సంస్థ సుందరీకరణ పనులను కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఇరువైపులా మెట్ల దారి, వేసి వాటికి రంగులు వేయడం తదితర పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో ఆరాతీశారు. మాజీ కార్పొరేటర్ గున్నామార్క్, నాయకులు ఉన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎంపీ



గోవా గవర్నర్‌తో ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ అశోక గజపతిరాజును ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్ వద్ద శాలువతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో

సి.బెళగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లోకి నది నుంచి వచ్చే నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలిపి కొళాయిలకు వదలాలని అన్నారు.

విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 2022లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌టీఏ-శ్రేష్ఠ పథకం ద్వారా ఎన్నికైన ఇతర రాష్ట్రాల్లో చదివిన కులాలకు చెందిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ ఎండ్లూరి లాజరస్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నరసింహ రాజు, పక్కీరన్న, విజయభాస్కర్ మాధవరాజు, ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత నెల 24 నుంచి 28 వరకు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి ఓపెన్ టూ ఆల్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్నూలు టీజీవీ, టీజీబీ తైక్వాండో అకాడమీ మార్షల్స్ ప్రతిభను చాటారు. విశ్వాసరావు 63 కేజీల విభాగంలో సిల్వర్, గువ్వల సూర్య భార్గవ్ 44 కేజీ విభాగంలో సిల్వర్, షికారీ మల్లికార్జున 63 కేజీ విభాంలో బ్రౌంజ్ పతకాలు సాధించారు. సోమవారం మౌర్యఇన్‌లోని తన చాంబరులో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జాతీయ స్థాయి తైక్వాండో విజేతలను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కోచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు వీల్ చైర్ల విరాళం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపే టకు చెందిన ఎస్.వెంకమ్మకు న్యూరోసర్జరీ వైద్యులు 2022లో చికిత్స అందించారు. ఆమె పూర్తిగా కోలుకున్నాక వైద్యులు, నర్సింగ్ సిబ్బంది విశేష సేవలు చేశారని కృతజ్ఞతగా వెంకమ్మ దంపతులు న్యూరోసర్జరీ విభాగానికి సోమవారం రెండు వీల్‌చైర్లను విరాళంగా అందించారు. న్యూరోసర్జరీ హెచ్‌వోడీ డా.రామబాలాజీ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.సురేంద్ర వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పుండరీకాంక్షయ్య, హెడ్ నర్సులు ఉమామహేశ్వరి, స్టాఫ్ నర్సులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఇంటిపట్టా మంజూరు

కల్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఏ.గోకులపాడుకు చెందిన ఎస్.రహంతుల్లా అనే దివ్యాంగుడికి తహసీల్దారు కె.ఆంజనేయులు ఇంటిపట్టా మంజూరు చేశారు. ఇంటిపట్టా మంజూరు చేయాలని పీజీఆర్ఎస్‌లో వికలాంగుడు దరఖాస్తు చేసుకోగా విచారణ జరిపి అర్జీ దారుని అర్హతను బట్టి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, కల్లూరు తహసీ ల్దార్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తహసీల్దారు రహంతుల్లాకు ఇంటిపట్టాను మంజూరు చేశారు.

జింకలతో నష్టపోతే పరిహారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తుగ్గలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జింకల వల్ల పంటలను నష్టపోతే పరిహారం మంజూరు చేయిస్తామని ఫారెస్టు ఆఫీసర్ లక్ష్మన్న తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'జింకల బెడదతో రైతుల బెంబేలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఫారెస్టు అధికారులు పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. జింకల వల్ల నష్టపోయిన రైతులు వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

మద్దికెర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. సోమవారం హెచ్ఎంలకు ప్రత్యేక తరగతుల పుస్తకాలను అందజేశారు. పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం 15వేల పుస్తకాలను మంజూరు చేసిందన్నారు. హెచ్ఎం దేవేంద్రప్ప ఉన్నారు.

అనుమతి లేని మందులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ మోహన్ విజయకుమార్

దేవనకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని ఏడీఏ మోహన్ విజయకుమార్, ఏవో ఉషారాణి హెచ్చరించారు. సోమవారం రైతు సేవా కేంద్రంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఎరువులు, పురుగుమందులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, దుకాణంలో పూర్తి వివరాలతో ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఈ నెల 14 వరకు పంటల బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. ఏఈవో రంగన్న, అబ్దుల్ సలాం, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఏ హాజరు వేయాల్సిందే

ఆలూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తప్పక ఎఫ్ఆర్ఏ హాజరు వేయాల్సిందేనని ఆలూరు ఎంఈవో కోమలదేవి సూచించారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఉదయం 9 గంటలకు ఫేషియల్ హాజరు కచ్చితంగా వేయాలని, అలా వేయని వారికి ఉన్నతాధికారుల నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఎం.కొట్కాల గ్రామం ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం

మద్దికెర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వర్ణలత అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కూరగాయలు, ఆకుకూరల



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వర్ణలత

స్టాల్స్‌ను పరిశీలించారు. క్రిమిసంహారక మందులు వాడకుండా పండించిన కూరగాయలు వాడితే మేలన్నారు. మండలంలోని హంపా, ఎం.అగ్రహారం గ్రామాల్లో 200 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేశామన్నారు. వీఆర్వోలు రంగస్వామి, సువర్ణమ్మ, కోఆర్డినేటర్ భీమరాజు ఉన్నారు.

సీపీఎం నాయకులకు నివాళి

దేవనకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన సీపీఎం నాయకులు సీఐటీయూ కార్యాలయంలో ఈశ్వరయ్య, షడక్‌కు నివాళి అర్పించారు. వెట్టిచాకిరీకి



నివాళి అర్పిస్తున్న నాయకులు

వ్యతిరేకంగా, పేదలకు ఇళ్లు, భూమిలేని రైతులకు భూముల పంపిణీకి పోరాటాలు చేశారన్నారు. అశోక్, పెద్దరాయుడు అన్నారు.

టీడీపీ వచ్చాకే నిధులు



మాట్లాడుతున్న పెద్దహుల్తి టీడీపీ నాయకులు

పత్తికొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చాకే పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయని పెద్దహుల్తి మాజీ సర్పంచ్ తిప్పన్న అన్నారు. సోమవారం మాట్లాడుతూ పెద్దహుల్తి గ్రామానికి చెందిన వారు పంచాయితీలకు నిధులు లేవని అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. పరిపూర్ణ గౌడ, శ్రీనివాసరెడ్డి, నల్లన్నలు ఉన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దుచేయాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లకు ఫేస్‌యాప్‌ను రద్దు చేసి 5జీ సిమ్‌లు ఇవ్వాలని సీఐటీయూ టీచర్ల సంఘం అధ్యక్షులు చిట్టెమ్మ, కార్యదర్శి పద్మజ డిమాండ్ చేశారు.



వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం సీడీపీవోకు వినతి పత్రం అందించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో టీఏ, డీఏ విడుదల చేయాలన్నారు. రవిచంద్ర, గోపాల్, అంగన్‌వాడీలు లక్ష్మి, కృష్ణమ్మ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

వెల్దుర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరి గ్రామం అంగన్వాడీ -1,2,3 కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ శిశువుకు పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు. పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. బాల్య వివాహాల నష్టాలను మహిళా పోలీసు ఛాయదేవి తెలియ జేశారు. పద్మావతి, మహేశ్వరి, నాగమద్దమ్మ, పెద్దమ్మ పాల్గొన్నారు.

నాణ్యత నగుబాటు



రెండడుగుల్లోపే వేసిన పిల్లర్ల పునాదులు



పైనే ఉన్న పిల్లర్

- రెండడుగుల్లోనే పునాదులు
- 'కస్తూర్బా'లో ఇష్టారాజ్యంగా తరగతి గదుల నిర్మాణం
- రూ.1.30 కోట్లతో నిర్మాణం

హొళగుంద, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ..1.30 కోట్లను మంజూరు చేసింది. మూడు డార్మెంటరీ గదులు, మూడు రెసిడెన్షియల్ గదులతో పాటు టాయిలెట్లను నిర్మిస్తున్నారు.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 6 అడుగులకు పైగా లోతులో తీయాల్సిన పునాదులను కేవలం 2 అడుగుల మేరకు తీసి, సిమెంట్ బెడ్ వేసి, పిల్లర్లు నిర్మిస్తున్నారు. భవన నిర్మాణానికి వాడిన 20ఎమ్ఎమ్ కంకర, స్టీలు సైతం నాసిరకంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

భవన నిర్మాణానికి 20 చెట్లు నరికివేత

తరగతి గదుల నిర్మాణానికి ఆవరణలో వున్న దాదాపు 20 చెట్లను నరికివేసినట్లు విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ వైపు మొక్కలను పెంచేందుకు రూ.లక్షల నిధులు ఖర్చు చేస్తుంటే, కాంట్రాక్టర్ ఇలా చెట్లను నరికివేయడం విచారకరం.

● ఈ విషయపై ఎస్ఎస్ఏ ఏఈ ఖాజా మొయినుద్దీన్‌ను వివరణ కోరగా కళాశాల నిర్మాణ పనులు నాణ్యతతో నిర్మిస్తున్నామని పునాదులు తవ్వుతుండగా రాళ్లు పడటంతో 40 ఎమ్ఎమ్ కంకరతో బెడ్ వేశామన్నారు.

పాస్ పుస్తకం లేక అవస్థ

- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ కావడం లేదు : తహసీల్దార్



మద్దికెర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోతున్నారు. మండలంలో మొత్తం 11 గ్రామాలు ఉన్నాయి. 22,500 హెక్టార్ల సాగు భూమి, 7,600 మంది రైతులు ఉన్నారు. మండల కేంద్రంలో కెనరా బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, రెండు సహకార సంఘాలు ఉన్నాయి. అయితే పాస్‌బుక్కు లేకపవోడంతో అప్రూవ్ కావడం లేదు. ఆన్‌లైన్‌లో పాసు పుస్తకాలు ఉంటేనే రుణం వస్తుందని సచివాలయ ఉద్యోగులు అంటుండగా, రెవెన్యూ అధికారులు మాత్రం సమాధానం చెప్పడం లేదని ఆరోపిస్తున్నారు. మరో నెలలో ఖరీఫ్ ముగుస్తుందని, రబీ ప్రారంభమయ్యే లోపైనా ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ గుండాల్ నాయక్ మాట్లాడుతూ ఆన్‌లైన్ సర్వర్ పని చేయడం లేదని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రెండు నెలల నుంచి తిరుగుతున్నా



పెద్దల నుంచి వచ్చిన భూమి ఉంది. రెండు నెలల నుంచి తిరుగుతున్నా పాసు పుస్తకాలు ఇవ్వడం లేదు. రెవెన్యూ అధికారులు సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారు. **- నరసన్న రైతు, మద్దికెర**

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

- సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయవద్దని, గడువులోపే పరిష్కరించి, అర్జీదారులను సంతృప్తి పరచాలన్నారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని..

1. తనకు పర్లప్లి గ్రామం సర్వేనంబర్ 129-ఏలో రీ సర్వే చేయగా 50 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో తక్కువగా చూపిస్తుందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామానికి చెందిన చిన్నహనుమంతు అర్జీ సమర్పించారు.
2. ఆదోని మైనార్టీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని, పారిశుధ్యం లోపించిందని, విద్యుత్ స్తంభాలు అపాయకరంగా ఉన్నాయని పరిష్కరించాలని కాలనీవాసులు అర్జీ సమర్పించారు.
3. 2023లో తన భర్త వెంకటేశ్వర్లు మృతి చెందాడని, వితంతు పింఛన్ మంజూరు చేయాలని చిన్నపెండేకల్లు గ్రామానికి చెందిన చంద్రమ్మ అర్జీ సమర్పించారు. ఏవో వసుంధర, డీఎల్‌పీవో తిమ్మక్క, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరావు, ఏడీఏ బాలవర్ధిరాజు, రమాదేవి, డీటీలు బాబు, రుద్రగౌడ్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆదోని, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలమంచి గ్రామం వైసీపీకి చెందిన 30 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజలకు అవసరమైన పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. దండు వెంకటేష్, హనుమంతు, హరీష్, గంగన్న, దండు తిక్కన్న, లాజర్, హుసేని ఉన్నారు.

ఈగల్ ఐజీ ఆర్థిక సాయం

దేవనకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పట్రాళ్ల మహిళాబ్యాంకు అధ్యక్షురాలు హనుమంతమ్మ మృతిచెందడతో ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ రూ.5వేల ఆర్థిక సాయం పంపారు. విషయం తెలుసుకున్న ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శి మంచి, రవికృష్ణ మేనేజరు నారాయణ అందజేశారు. రవికుమార్, సుధాకర్ ఉన్నారు.



నగదు అందజేస్తున్న రవికృష్ణ సహాయకులు

యూరియా, ఎరువులు ఇవ్వడంలో విఫలం

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఎరువులు, యూరియా అందించడంలో విఫలమైందని ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపిం చారు. సోమవారం మాట్లాడుతూ ఎకరాకు బస్తా ఎరువు మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వం చెప్పేది ఒక్కటి చేసేదొకటన్నారు. ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి రూ.7 వేలు మాత్రమే జమచేశారని, అది కూడా సక్రమంగా అందడం లేదన్నారు. గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలతో మేలు చేశామన్నారు. ప్రభుత్వం తెచ్చిన రూ.లక్ష కోట్లు ఎవరికి ఇచ్చారని, ఆడబిడ్డ నిధిని కూడా ఇవ్వలేదన్నారు. 50 ఏళ్లకే పింఛన్ హామీ ఏమైందన్నారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కేవలం ప్యాకేజీకి పరిమితమయ్యారని ఆరోపించారు. ఎంపీటీసీ నాగమ్మ, సభ్యులు గౌడప్ప, మాజీ ఎంపీటీసీ భస్కార్, రాజశేఖర్, వరుణ్, అనిల్, తిక్కస్వామి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. భక్తులకు గాయాలు

ఆదోని రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పగల్లు వద్ద భక్తులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా బడి వారు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు తెలిపిన మేరకు.. సోమవారం ఉరుకుందలో దర్శనం అనంతరం ఆదోనికి బయల్దేరారు. కాగా కుప్పగల్లు సమీపం వద్ద రాగానే బ్రేకు ఫెయిలై ప్రమాదానికి గురైంది. ఆటోలో ప్రయాణికులు ఈరమ్మ, లలితమ్మ, ఈరన్న గౌడ్‌కు తీవ్ర గాయాలు తగిలాయి. వీరిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దతుంబళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న ఆటో

హంద్రీ జలాలతోనే సస్యశ్యామలం

- పాలకుల నిర్లక్ష్యంతోనే వెనకబాటుతనం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రామచంద్రయ్య



ఈశ్వర్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా జలాలతోనే పత్తికొండ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రామచంద్రయ్య, గౌస్‌దేశాయ్ అన్నారు. సోమవారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్‌రెడ్డి 46వ వర్ధంతి నిర్వహించారు. కృష్ణా జలాలను మళ్లించాలని 40 ఏళ్ల క్రితమే నరిసన తెలపడంతో ఇప్పటికి నీరు వచ్చిందన్నారు. పందికోన రిజర్వాయర్ కింద 60 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నా, పాలకుల నిర్లక్ష్యంతో కుడి, ఎడమ కాలువలు పూర్తిగాక సాగునీరు అందడం లేదన్నారు. ఆనందబాబు, వీరశేఖర్, రంగారెడ్డి, సోమ్లానాయక్, మధుబాబు, లక్ష్మన్న, రాజాసాహెబ్, ఉన్నారు.

తుగ్గలి: మాజీ ఎమ్మెల్యే, దివంగత ఈశ్వర్ రెడ్డి సేవలు మరువలేనివని సీపీఎం నాయకుడు శ్రీరాములు అన్నారు. సోమవారం తుగ్గలిలో వర్ధంతి నిర్వహించారు. నిరుపేదలకు భూములు పంచారని, ఆయన ఆశయ సాధన కోస కృషి చేయాలన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్లను బాగుచేయండి

ఆదోని రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ అండ్ బీ రహదారులను బాగుచేయాలని సీపీఎం నాయకులు లింగన్న, రామాంజనేయులు కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తిమ్మారెడ్డి బస్టాండు నుంచి శిరుగుప్ప క్రాస్ వరకు, బైచిగేరి నుంచి కపటి, ఢణాపురం-నాగనాథనహళ్ళి రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

హొళగుంద, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం, సిరుగుప్ప తాలుక ఉలూరు గ్రామానికి చెందిన కురువ ఈశ్వరమ్మ అనే వృద్ధురాలు దిగువ కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. సోమవారం మధ్యాహ్నం హొళగుంద శివారు ఎల్ఎల్‌సీ 55 డిస్ట్రిబ్యూషన్ పాయింట్) వద్ద కాలువలో దూకడంతో గమనించిన యువకులు కాపాడారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యుల ఆచూకీ కనుక్కొని అప్పగిం చారు. తాను బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధవ డుండటంతో, నొప్పికి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వృద్ధురాలు తెలిపిందన్నారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

భూసారం మేరకు ఎరువులు వాడాలి


మద్దికెర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు భూసారం మేరకు ఎరువులు వాడాలని ఏవో రవి సూచించారు. సోమవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. కందులు, జొన్నలు, మినీ కిట్ల విత్తనాలు ఉచితంగా ఇచ్చామని, విత్తనశుద్ధి చేశాక విత్తుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా హుసేనప్ప యాదవ్



ఆదోని టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా ఆదోనికి చెందిన హుసేనప్ప యాదవ్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. తనను గుర్తించి తనకు జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించడంతో పట్ల హుసేనప్ప హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా ఇన్‌చార్జి అంకం రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ఎమ్మెల్యే పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోనగర్ స్థల పరిశీలన



తహసీల్దార్ రమేష్

ఆదోని రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆటోనగర్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నామని తహసీల్దార్ రమేష్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు ఆదోని శివారుల్లోని పలు ప్రభుత్వ భూములను పరిశీలించామన్నారు. ఆటో నగర్ ఏర్పాటుకు 50నుంచి 60 ఎకరాల భూమి అవసరమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రణమండల కొండల్లోని సారా స్థావరాలపై సోమవారం దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. 475 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 27 లీటర్ల సారాను స్వాధీనం చేసుకునామన్నారు. బోయ నాగిరెడ్డి, బావాజీపేటకు చెందిన బోయ శిలపై కేసు నమోదు చేశామన్నారు.

ఇళ్లను పూర్తి చేసుకోండి

మద్దికెర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హాయంలో జగనన్న కాలనీ పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ సూచించారు. సోమవారం లబ్దిదారులకు నోటీసులు అందజేశారు. మండలంలో దాదాపు 300 మందికి పైగా పక్కా గృహాలు మంజూరైనా పూర్తి చేయలేదన్నారు. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన డబ్బును వాడుకుని, గృహాన్ని నిర్మించుకోలేదన్నారు. గృహాలు నిర్మించుకోలేని పక్షంలో ప్రభుత్వానికి డబ్బు తిరిగి చెల్లించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద 39 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు.

ఐదుగురికి గాయాలు

పత్తికొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ఆదోనిరహదారిలో సోమవారం సాయంత్రం ఆటో బోల్తాపడి ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల మేరకు.. ఆస్పరి మండలం చిరుమానుదొడ్డి గ్రామానికి చెందిన రైతులు సుంకన్న, బలరాం, వీరన్న, బాలముని, రాజు తాము పండించిన చౌలేకాయలను మార్కెట్‌యార్డులో విక్రయించేందుకు ఆటోలో వచ్చారు. విక్రయించిన అనంతరం అదే ఆటోలో గ్రామానికి భయలుదేరారు. ఆదోని రోడ్డులోని దర్గావద్ద బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూ సమస్యను పరిష్కరించిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న నిషేధిత భూ సమస్యను పరిష్కరించినందుకు రైతు విశ్వనాథ్ రెడ్డి కలెక్టర్ పి.రంజిత్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదోని మండలం చిన్నగోనేహల్‌కు చెందిన రైతు ఎల్.విశ్వనాథ్ రెడ్డికి సంతేకొడ్లూరు గ్రామ పరిధిలోని 435-ఏ సర్వే.నెం.1.66 ఎకరాల భూమి ఉంది. ఈయన తన అవసరాల కోసం 2015లో తన భూమిని వేరే వారికి విక్రయించారు. భూమిని కొన్నవారు 2018లో లోన్ కోసం బ్యాంకుకు వెళ్లగా, ఈ భూమి నిషేధిత జాబితాలో ఉందని తెలపడంతో భూమి కొన్నవారు విశ్వనాథ్‌రెడ్డితో గొడవకు దిగడంతో, భూమి కొన్న వారికి ఆయన డబ్బులు తిరిగి చెల్లించాడు. 435.ఏ సర్వే.నెం.లో విశ్వనాథరెడ్డి భూమి 1.66 ఎకరాలతో పాటు 0.81 ఎకరాల వాగు పొరంబోకు భూమి కలిపి ఉండటంతో రెండు కలిపి మొత్తం 2.47 ఎకరాలను 2016లో 22ఏ కింద నోటిఫై చేశారు. 2018 నుంచి విశ్వనాథరెడ్డి తన భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని అధికారుల చుట్టూ తిరుగుతు న్నారు. చివరకు పీజీఆర్ఎస్‌లో ఈ సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌విశ్వనాథరెడ్డి భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి డీ-నోటిఫై చేశారు.

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు ఎంఈవో కోమలదేవి



ఆలూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా చూస్తామని మండల విద్యాశాఖాధికారి కోమలదేవి తెలిపారు.

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మీ చర్యలేమి?

జవాబు: ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేసి విద్యార్థుల హాజరును పరిశీలిస్తాం. ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్నాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజనం అమలు ఎలా ఉంది.?

జవాబు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూస్తున్నాం

ప్రశ్న: నాడు-నేడు కింద గత ప్రభుత్వం హయాంలో నిర్మాణ దశలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల పరిస్థితి ఏమిటి?

జవాబు: మండలంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు కేడు కింద దాదాపు 10 పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

ప్రశ్న: ప్రయివేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నారా?

జవాబు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ చేస్తున్నారా?

జవాబు: ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు సన్నబియ్యాన్ని సరఫరా చేసింది. మెనూ ప్రకారం ఏజెన్సీలు వడ్డించేలా చూస్తాం. హెచ్ఎంలు పర్యవేక్షణ చేయాలి. సక్రమంగా వడ్డించని ఏజెన్సీలను మార్పు చేస్తాం.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఉందా? సమస్యను ఎలా పరిష్కరిస్తారు..?

జవాబు: మండలంలో 100 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వచ్చే నెలలో డీఎస్సీ ద్వారా ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపడితే ఇక ఉపాధ్యాయుల కొరత ఉండదు.

షడ్రక్ ఆశయాలను కొనసాగిస్తాం



షడ్రక్‌కు నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): : సీపీఎం రాష్ట్ర నాయకుడు షడ్రక్ ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు గోవిందు, రాముడు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో షడ్రక్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటాలు చేసి ఇళ్ళ స్థలాలు ఇప్పించారని గుర్తు చేసుకున్నారు. ప్రజా సంఘాల నిర్మాణంలో ఎంతో కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, నరసయ్య, కాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరుణ హోమం


తుంగభద్ర జలాన్ని తీసుకొస్తున్న భక్తులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా పడాలని వరుణదేవుడి కరుణ కటాక్షం కోసం సోమవారం పట్టణంలోని వీవర్స్ కాలనీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, పట్టణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్ల ఆధ్వర్యంలో వరుణ హోమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేంద్ర బాబు, ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నవీన్ కుమార్, కురువ శీలన్న, మోహన్ కుమార్, సత్యారెడ్డి, మల్లికార్జున, కిరణ్‌సీడ్స్ నాగరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి


ఆర్ఐకి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోసిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ముందున్న డంపింగ్ యార్డును తొలగించాలని, అలాగే కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు ఆటస్థలం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశ్ మాట్లాడుతూ ఇంటి గ్రేటెడ్ హాస్టల్ ముందు డంపింగ్ యార్డు ఉండడంవల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్ఐ శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, మల్లికార్జున, వీరారెడ్డి, కృష్ణమూర్తి, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

'మహిళా శక్తి' అమలుకు సన్నద్ధం: డీఎం


కండక్టర్‌లకు ఉచిత టికెట్లపై
అవగాహన కల్పిస్తున్న డిపో మెనేజర్ మద్దిలేటి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం అమలుకు సన్నద్ధత అవుతున్నట్లు డిపో మెనేజర్ మద్దిలేటి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌టీసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు టికెట్లు ఎలా ఇష్యూ చేయాలి అనే దానిపై కండక్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆగస్టు 15వ తేదీన ప్రారంభమయ్యే ఫ్రీ బస్సుకు రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేసిన గుర్తింపు కార్డులు చూపించి ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ముస్తాక్ అహ్మద్, బజారప్ప, సామేలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే రెండవ ఉరుకుంద క్షేత్రంగా వెలుగొందిన మసీదుపురం లక్ష్మీ నరసింహస్వామి(నరసప్పస్వామి)కి శ్రావణమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చ, ప్రత్యేక అలంకరణ, మహాగణారాధన, మహామంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ పూజారులలు నరసన్న, ఈరన్న, నారయణ, సుధాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరి మళ ప్రసాదం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వ ర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందా వనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే అధికారులు కల్పించనున్నారు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

పెద్దకడబూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చుగిరి గ్రామంలో సోమవారం వాల్మీకి మహర్షి, భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేనా ఇన్‌చార్జి లక్ష్మన్న, రైతు సంఘం రాష్ట అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మంత్రాలయం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నాగేష్, మల్లికార్జున, మొత్రు రామాంజనేయులు, రాకేష్ రెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

నీటి కష్టాలు తప్పవా?

● ఈ ఏడాది జీడీపీకి చేరని వరద నీరు
● ఆందోళనలో రైతులు


గాజులదిన్నె ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీరు ఉన్న దృశ్యం


కుడి కాలువ ద్వారా పంటలకు జీడీపీ నీరు

గోనెగండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు అయిన సంజీవయ్యసాగర్ గాజులదిన్నె ప్రాజెక్టుకు ఈ ఏడాది నీటి కష్టాలు వస్తాయని తెలుస్తోంది. ఆగస్టునెల ప్రారంభం అయినప్పటికీ ఇప్పటి వరకు ప్రాజెక్టుకు ఒక్క సారి కూడా వరద నీరు వచ్చి చేరలేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 1 టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఇక వర్షాల వల్ల ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతుందన్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. రోజూ ప్రాజెక్టు నుంచి ఆవిరిరూపంలో 30నుంచి 50క్యూసెక్కుల వరకు వృథా అవుతోంది.

హంద్రీనీవా నుంచి రోజుకు 110 క్యూసెక్కుల నీరు మాత్రమే:

హంద్రీనీవా(శ్రీశైలం బ్యాక్‌వాటర్) నుంచి జీడీపీకి 15 రోజులుగా రోజుకు 110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ నీరు ప్రస్తుతం ప్రాజెక్టుకు జీవనాధారం హంద్రీనీవా నీరు లేక పోతే ప్రాజెక్టు ఎండి పోయి ఉండేది. దీని కింద ఉన్న పంటలు, తాగునీటి పథకాలకు, నీరు లేక ఇబ్బందులు వచ్చేవి. నాలుగు రోజుల నుంచి జీడీపీ కి మళ్లించిన ఎల్లెల్సీ నీరుకూడా నిలిపేశారు. ఇదే పద్ధతి కొనసాగితే ప్రాజెక్టు కు నీటి ఇక్కట్లు తప్పవని చెప్పవచ్చును.

ఎడమ కాలువతో కోడుమూరుకు:

వానలు పడకపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు వస్తున్నాయి అందులో భాగంగా కోడుమూరు, ఆ పరిసర ప్రాంతాలలో తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో గాజులదిన్నె ప్రాజెక్టు అధికారులు 10 రోజుల నుంచి కోడుమూరుకు జీడీపీ ఎడవ కాలువ ద్వార రోజకు హంద్రీనదికి 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కోడుమూరుతోపాటు పరిసర ప్రాంతాల గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి. కోడుమూరు హంద్రీనదిని చేరితే కోడుమూరు తాగునీటికి 30 క్యూసెక్కుల నీరు వదలి మిగత 40 క్యూసెక్కుల నీటిని ఎల్లెల్సీ కింద పంటలు సాగు చేసుకున్న రైతులకు మళ్లిస్తున్నట్లు జీడీపీ అధికారులు తెలుపుతున్నారు.

కుడికాల్వ ద్వారా 100 క్యూసెక్కుల నీరు విడుదల:

ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో రైతులు వర్షాలు కురుస్తాయాన్న ఆశతో ఎక్కువగా పత్తి పంటను సాగు చేసుకున్నారు. అయితే వర్షాలకు పడక పోవడంతో పంట ఎండిపోతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు కుడికాలువ ద్వార రోజుకు 100 క్యూసెక్కుల నీటిని సాగు చేసిన పంటలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కింద కేవలం రబీ సీజన్‌లో మాత్రమే పంటలకు విడుదల చేయాలి కాని ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో నీటిని విడదలు చేసి రైతులకు అందిస్తున్నారు.

జీడీపీకి నిలిచిపోయిన ఎల్లెల్సీ మళ్లింపు:

గాజులదిన్నె ప్రాజెక్టుకు 15 రోజులుగా ఎల్లెల్సీనీటిని మళ్లించారు. అయితే గత నాలుగురోజులుగా జీడీపీకి నీటి విడుదలను ఎల్లెల్సీ అధికారులు నిలిపివేశారు. గోనెగండ్లకు ప్రస్తుతం ఎల్లెల్సీ నుంచి 75 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల అవుతోంది. అందులో 30 క్యూసెక్కుల నీటిని కోడుమూరు పంట పొలాలకు మళ్లించి మిగిలిన 45 క్యూసెక్కుల నీటిని గోనెగండ్ల పంట పొలాలలకు తాగునీటి పథకాలను మళ్లిస్తున్నారు. ఇక జీడీపీ కేవలం హంద్రీనీవా నీటి పైనే ఆధాపడి ఉంది. ఇక జీడీపి కింద రబీలో సాగుకు నీటి ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయకట్టు రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పేదల కడుపు కొట్టిన వైసీపీ


అన్న క్యాంటీన్‌కు భూమి పూజ చేస్తున్న టీడీపీ మంత్రాలయం
ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

కోసిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తొలగించి పేదల కడుపు కొట్టిందని... ఆ ఉసురు తగిలి గత ఎన్నికల్లో వైసీపీ నామరూపాలు లేకుండాపోయిందని ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా పేద ప్రజల శాపనార్థాలకు వైసీపీ బలైందని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్ సమీపంలో రూ.60 లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. మంత్రాలయం నియోజకవర్గం తరపున అన్ని మండలాలకు అనువైన మండలంగా ప్రజలకు ఎక్కువ శాతం ఉపయోగపడే విధంగా ఉన్న కోసిగిలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు కోసిగి మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు మంజూరైందని, దీని కోసం రూ.60లక్షలతో ఎన్‌సీసీ కంపెనీ వారు నిర్మిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి, సర్పంచ్ అయ్యమ్మ, మంత్రాలయం బీజేపీ ఇన్‌చార్జి విష్ణువర్దన్ రెడ్డి, టీడీపీ యువ నాయకులు రాకేష్ రెడ్డి, నాయకులు ముత్తురెడ్డి, సురేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ


లారీ, కారు ఢీకొన్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని హరిపురం వైజంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి లారీ.. కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కియ పోలీసులు తెలిపిన మేరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఇంద్రజ, సుధాకర్, ఆద్య, వీరేష్, రాఘవేంద్ర, శశికళ, యశ్వంత్, దీప్తిప్రియ రెండ్రోజుల కిందట తమిళనాడులోని అరుణాచలం వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో పెనుకొండ సమీపంలోని హరిపురం వైజంక్షన్ వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించినట్లు తెలిపారు.

భక్తులకు ఏర్పాట్లు

మంత్రాలయం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు ఈ నెల 8 నుంచి 14వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు దర్శన క్యూలైన్లు, తాగునీరు, ఆహ్లాదకరమైన వాతావరణం, పార్కింగ్, బస్సు, రైలు సౌకర్యాలు, రాయచూరు చెందిన నవోదయ బృందంచే వైద్యశిబిరాలు, ఓవర్ బ్రిడ్జి ద్వారా ప్రత్యేక క్యూలైన్లు ఈ ఏడాది ఏర్పాటు చేశామని తెలిపారు. గర్భగుడి స్థంబాలకు బంగారు కవచాలు, తూర్పు, దక్షిణం గర్భగుడి శిలామండపానికి బంగారు పూత పూయడం వంటి చేశామన్నారు. వాహనాల్లో వచ్చిన భక్తులకు రాఘవేంద్ర సర్కిల్‌లో పాత ఆర్అండ్‌బీ, బస్టాండు ఎదురుగా మూడున్నర ఎకరాలు, హెలిప్యాడ్ గ్రౌండులో 40 ఎకరాలు, నదీతీరంలో పార్కింగ్, పరిమళ పాఠశాలలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా పాత ఆర్అండ్‌బీ స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన రూ.66 కోట్లతో 480 గదులు నిర్మాణానికి దేవాదాయ శాఖ అనుమతి వచ్చిందని, త్వరలో టెండర్లుకు ఆహ్వానిస్తామన్నారు. అదనంగా 200 గదుల నిర్మాణానికి టెండరు పూర్తయిందని తెలిపారు. ముందు భాగంలో 150 అడుగుల పొడవు 150 అడుగుల వ్యవస్థతతో డార్మెంటరీ, లాకర్స్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామనీ అన్నారు. నరహరితీర్థ వందగదుల సముదాయం పక్కనే మరో వంద గదుల నిర్మాణానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. కులమతాలకు అతీతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకోవచ్చని, స్వామివారి దర్శనానికి ఉచితంగా దర్శించుకోవచ్చని, ఎటువంటి డబ్బులు చెల్లించే ప్రసక్తి ఉండదన్నారు. దర్శనానికి వచ్చిన భక్తులు ఇచ్చే కానుకలు, హుండీల్లో, శ్రీమఠం ఆఫీసులో చెల్లించి రసీదు పొందాలని, ప్రైవేటు వ్యక్తులకు పైసా కూడా ఇవ్వద్దని భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సూచించారు. మహారథంపైన బెంగుళూరు చెందిన భక్తుడు హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పరిశుభ్రత, పోలీసు బందోబస్తు కొనసాగుతుందని, నదీతీరంలో, శ్రీమఠం ప్రాంగణంలో భక్తులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజా ఎస్ అప్రమేయాచార్, జయతీర్థాచార్, ప్రకాషాచార్, మురళి స్వామి, శ్రీనిధి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఠాధిపతి

ఎప్పుడు కూలుతుందో..

● పెచ్చులూడుతున్న పాఠశాల భవనం ● ముళ్లకంపతో అడ్డుకట్ట వేసిన ఉపాధ్యాయులు


పెచ్చులూడిన పాఠశాల భవనం


ముళ్లకంపను అడ్డుగా వేసిన ఉపాధ్యాయులు

మంత్రాలయం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు కూలుతుందో.. పగుళ్లు, పెచ్చులూడుతున్న పాఠశాల భవనం నుంచి ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో.. భయం భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గడుపుతున్నారు. పాత గదిలో విద్యాబోధన కొనసాగించాలంటే క్షణ క్షణం భయం భయంతో ఆ తరగతి గదిని ఖాళీ చేశారు. మంత్రాలయం మండలంలోని సూగూరు డిపెప్ ప్రాథమిక పాఠశాలలో ఈ దుస్థితి నెలకొంది. నాలుగు గదుల్లో రెండు గదులు శిథిలావస్థకు చేరాయి. వర్షం వస్తే కారుతుంది. ఒక భవనం పిల్లర్లులో పగుళ్లు, పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందోనని భయంతో ఉపాధ్యాయులు బిక్కుబిక్కు మంటున్నారు. ఆ గది వైపు విద్యార్థులు వెళ్లకుండా మంగళవారం ముళ్లకంచతో అడ్డుకట్ట వేశారు. ఇది తాత్కాలికమే అయినా, సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత గ్రామస్థులు, పిల్లలు ఇక్కడే ఆడుకుంటూ సర్వసాధరణంగా గడుపుతున్నారు. పిల్లర్లు, పైపెచ్చులుడుతూ కూలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత భవనాన్ని కూల్చేసి ప్రమాదం నుంచి ఉపాధ్యాయులను, విద్యార్థులను గట్టెక్కించాలని అధికారులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిరుత సంచారంపై ఆరా


ప్రజలతో మాట్లాడుతున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తేజశ్విని

గోనెగండ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని గంజహళ్లి, ఎన్నెకండ్ల, గ్రామాలలో పంట పొలాల్లో చిరుత సంచారంపై ఆయా గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆదోని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తేజశ్విని, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నూర్జహాన్, బీట్ ఆఫీసర్ రవికుమార్ గంజహళ్లి గ్రామంలో విచారణ జరిపారు. చిరుత వచ్చిందా లేక మరో జంతువు ఏదైనా సంచరించిందా అని పొలాల్లోని పాదముద్రలను పరిశీలించి, గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామ సర్పంచ్ రాముడు, ప్రజలు మాట్లాడుతూ వారం రోజుల క్రితం దున్నపోతును చంపిందని కళేబరం దగ్గరకు వచ్చి మాంసం తిన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం కూడా పంట పొలాల్లో పనులు చేస్తున్న రైతులకు చిరుత కనిపించిందని గ్రామస్థులు అధికారులకు వివరించారు. అనంతరం ఫారెస్టు రేంజ్‌ఆఫీసర్ తేజశ్విని మాట్లాడుతూ చిరుత సంచరించిందన్న ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చిరుత నా లేక హైనానా, తోడేలా అన్నది నిర్ధారణ అయ్యేవరకు పంట పొలాలకు ఒక్కరుగా వెళ్ల వద్దన్నారు. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరిస్తామని ఫారెస్టు అధికారులు హామీ ఇచ్చారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఆరీసీ డిపోలో పనిచేస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆన్‌కాల్ డ్రైవర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ కార్యదర్శి రంగన్న హాజరయ్యారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనాన్ని రూ.26వేలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు అందరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షులు వీరేష్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నాయకులు ఎర్రిస్వామి, సోమేష్, కిషోర్, వలి, నవీన్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడబూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు, రాజ్‌కుమార్, బొడ్డన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన పెద్దకడుబూరుకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ఎస్ఎస్ ట్యాంకు ఫిల్టర్ బెడ్లను మార్చాలని, నీటి సంపులకు మరమ్మతులు చేయాలని, ఎస్సీ కాలనీలో ఉన్న నరసప్ప బావిని పూడ్చాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు దేవదాసు, తిక్కన్న, రాజారత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

'యూరియా పంపిణీలో నిర్లక్ష్యం'

నందవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ నాయకుడు గురురాజారావు తెలిపారు. సోమవారం నందవరం వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి ఏవో సరితను ఆయన వివరణ కోరగా మాచాపురంకు 25 మెట్రిక్ టన్నులు, సోమలగూడురుకు 65 మెట్రిక్ టన్నులు, నందవరంకు 25 మెట్రిక్ టన్నులు పంపించామని సమాధానం ఇవ్వడంతో మిగతా గ్రామాలకు కూడా సకాలంలో యూరియా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడు, తోట పాండు, శివ, దానియేలు, సుభాన్ పాల్గొన్నారు.

ఒత్తిడితో విధులు నిర్వహించలేం

మంత్రాలయం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు నెట్‌వర్క్ సరిగ్గా లేని, పని చేయని సెల్‌ఫోన్లు తమకు వద్దని అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు భీమేశ్వరి, విజయలక్ష్మి, లూసమ్మ తెలిపారు. సోమవారం మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో రాజేశ్వరిని కలిసి తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హెప్సిబా, విశాలాక్షి, సుజాత, జయమ్మ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్:

అంగన్‌వాడీ వర్కర్లు ఐసీడీఎస్ అధికారులకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లను అప్పగించారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, శైలజ, నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం తమకు 2జీ సెల్‌ఫోన్లను ఇచ్చారని, వీటి వల్ల నెట్ వర్క్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, అంగన్వాడీ వర్కర్లు గ్రేషమ్మ, మేరి, వరలక్ష్మి, శారద లు పాల్గొన్నారు.

ఉత్తర్వులను రద్దు చేయాలి



ప్రభుత్వ ఉత్తర్వులను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు కళాశాలల్లోకి ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్, పట్టణ అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి ఉత్తర్వులను దహనం చేశారు. ఈ ఉత్తర్వులు విద్యార్థి హక్కులపై దాడిగా భావిస్తూ, తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విద్యార్థి ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ నిర్ణయం ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని తెలుపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్, యశ్వంత్, వెంకీ, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.